## క్లుప్తంగా

### రాయితీ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిన్నమండెం: ప్రభుత్వం ప్రకటించిన స్వయం ఉపాధి పథకాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీఓ శేఖర్‌నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులు వివిధ పథకాల ద్వారా రాయితీ రుణం పొందేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఏపీ–ఓబీఎంఎంఎస్ ద్వారా పేర్లను ఈ నెల 7వతేదీ లోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

### సభ్యుల వివరాలు భద్రపరచాలి



మాట్లాడుతున్న ఏపీఎం దేవసేన

రామాపురం: మండలంలోని అన్ని గ్రామాలలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల వివరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక లోకో యాప్‌లో భద్రపరచాలని వెలుగు ఏపీఎం దేవసేన పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్వయం సహాయక సంఘం కార్యాలయంలో వీఓఏలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బ్యాంకులో చెల్లించే పొదుపు, వారు తీసుకున్న రుణాలు, చెల్లించే డబ్బు, శ్రీనిధికి సంబంధించిన వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. సంఘానికి సంబంధించిన విషయాలను సభ్యులు ఎప్పుడైనా మొబైల్‌లో చూసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సీసీలు ఆదినారాయణ, నాగరాజ, నరసింహులురెడ్డి, బాబు, గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

### రేపు మండల సమావేశం

చిన్నమండెం: చిన్నమండెం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేఖర్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సుధామాధురి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు.

### పైథాన్ లాంగ్వేజ్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ వరప్రసాద్

రాయచోటి అర్బన్: పోటీ ప్రపంచంలో వెబ్, ఎంటర్ ప్రైజెస్, ఎంబెడెడ్ అప్లికేషన్స్ రంగాల్లో పైథాన్ ప్రోగ్రామింగ్ పాత్ర కీలకమని ముఖ్య రీసోర్స్ పర్సన్ వరప్రసాద్ అన్నారు. స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో పైథాన్ లాంగ్వేజ్ ప్రోగ్రాం అంశంపై రెండు రోజుల వర్క్ షాప్ బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సి, సి ప్లస్, జావా లాంటి ప్రోగామింగ్ లాంగ్వేజ్ స్థానాలను పైథాన్ లాంగ్వేజ్ అధిగమించిందన్నారు. ఏడీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ రంగంలో డేటా అనాలసిస్, టాస్క్ ఆటోమేషన్, డేటా విజువలైజేషన్, పైచార్ట్‌లకు ఆపార అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సంప్రోక్షణకు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఎస్ఈ మనోహరన్

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని సంప్రోక్షణ ఉత్సవాలకు సిద్ధం చేయాలని టీటీడీ సివిల్ విభాగం ఎస్ఈ మనోహరన్ తెలిపారు. ఒంటిమిట్ట రామాలయానికి విచ్చేసిన ఆయన జీర్ణోద్ధరణ పనులను బుధవారం పరిశీలించారు. అనంతరం ఆలయ గర్భాలయం, రంగ మండపం పనులను తనిఖీ చేశారు. టీటీడీ సివిల్ విభాగం ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

### పది విద్యార్థులకు ప్రేరణ తరగతులు



ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్న సిబ్బంది

చిట్వేలి: చిట్వేలి సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. రైల్వేకోడూరు నియోజకవర్గం వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులందరూ పాల్గొన్నారు. ఆసక్తిగా వింటూ ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సాధికారత అధికారి జయప్రకాష్, కోడూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాస మూర్తి, ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, వసతి గృహ సంక్షేమ అధికారులు కిరణ్, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# యమ డేంజర్ జంక్ ఫుడ్!

**నగర జన జీవన విధానం, ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సంప్రదాయ వంటకాల స్థానంలో జంక్ ఫుడ్స్ తీసుకుంటూ అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. జంక్ ఫుడ్స్ యమ డేంజర్ అనేది గుర్తుంచుకోవాలంటున్నారు వైద్యులు.. సంప్రదాయ వంటకాలకు స్వస్తి పలికే సంస్కృతి దాదాపు వచ్చేసింది.**

- పిజ్జాలు, బర్గర్‌లపైనే జనం మక్కువ
- నాన్ వెజ్ వెరైటీలకు ఫిదా
- అనారోగ్యమేనంటున్న వైద్యులు



పానీపూరి తింటున్న విద్యార్థులు



జంక్‌ఫుడ్

రాజంపేట: రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, తదితర మండల కేంద్రాలలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. వీటి సంఖ్య రోజూ పెరుగుతోంది. అన్ని వర్గాల వారు మక్కువ పెంచుకోవడంతో సంప్రదాయ వంటకాల కంటే పిజ్జా, బర్గర్లు, పానీపూరి, బేల్‌పూరి, సమోసా, కట్‌లెట్, చాట్, బేకరి పదార్థాల వినియోగం పెరుగుతోంది. దీంతో జంక్ ఫుడ్ వ్యాపారం సాయంత్రం, రాత్రి అధికంగా కొనసాగుతోంది. ఏటా 20 శాతం చొప్పున అమ్మకాలు పెరుగు తున్నాయి.

**పిల్లలో స్థూలకాయం**

పిల్లలు చిరు తిండ్ల మీద ఎక్కువగా ఆధారపడుతుంటే ఖచ్చితంగా ఒబెసిటీ సమస్య వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యకు సంబంధించిన లక్షణాలు గుర్తించి వాటిని ఆపడానికి అవసరమైన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యధికంగా ప్రాసెస్ చేసిన ఫాస్ట్ ఫుడ్స్, కార్పొరేట్ డ్రింక్స్ తగ్గించాలి. ఇంట్లో టెలివిజన్ ముందు విశ్రాంతిగా ఎక్కువసేపు కూర్చున్నా, వీడియో గేమ్స్ ఆడినా స్థూలకాయులుగా మారిపోతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పళ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటే మంచిది. చిప్స్, పిజ్జాలు, డ్రింక్స్ తీసుకోకుండా చూడాలి. లేకపోతే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువని చెబుతున్నారు.

**శుభ పరిణామం కాదు**

జంక్ ఫుడ్ మార్కెట్ విస్తరించడం శుభపరిణామం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంక్ ఫుడ్ ఆరోగ్యానికి హానికరమని, మత్తు మాదక ద్రవ్యాలు, సిగరెట్, పాన్‌పరాగ్‌లు ఆరోగ్యాన్ని కుళ్లబొడిచినట్లే జంక్ ఫుడ్ కూడా హెల్త్‌ను దెబ్బతీసిందని హెచ్చరిస్తున్నారు. మధుమేహం, గుండె రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులకు అది కారణమవుతోందని అంటున్నారు.

**చికిత్స కన్నా..నివారణే మేలు**



వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే.. రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మేలు. ప్రస్తుతం ఫాస్ట్ ఫుడ్ అంటే పిల్లలు, పెద్దలు లొట్టలేసుకొని తినేస్తున్నారు. పిల్లలకు చెబితే వినే దానికన్నా చూసి నేర్చుకోవడం ఎక్కువ. ప్రస్తుతం తల్లిదండ్రులు సైతం ఫాస్ట్‌పుడ్స్ లాగించేస్తున్నారు. బర్గర్‌లు, పిజ్జాలు తినడంతో అధిక కొల్రస్టాల్ వస్తుంది. మధుమేహం, రక్తపోటు , మానసిక రుగ్మతలు, గురక వంటి సమస్యలు వస్తాయి.

– డా.మునిబాలకృష్ణ, మధుమేహ నిపుణుడు, రాజంపేట

## విదేశీ బీమా కంపెనీలతో దేశ భద్రతకు ముప్పు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

రాజంపేట టౌన్: విదేశీ బీమా కంపెనీలతో దేశ భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాజంపేట బ్రాంచ్ కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను వందశాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, పింఛనర్లు, ఏజెంట్లు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి, సుభాష్‌చంద్ర మాట్లాడుతూ కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను నేరుగా ఆహ్వానించేలా నిర్ణయం తీసుకోవడం బీమా రంగానికేగాక పాలసీదారులకు ఏ మాత్రం మేలు చేయదని తెలిపారు. గ్రామీణ పాలసీదారులకు సకాలంలో చెల్లింపులు చేస్తూ దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసీకి స్వయంప్రతిపత్తి ఇవ్వాల్సిందిపోయి, కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. పార్లమెంటులో ఎఫ్‌డీఐని పెంచుతూ బీమా చట్టసవరణ బిల్లు తీసుకువస్తే సమ్మెకైనా వెనకాడబోమని హెచ్చరించారు. విదేశీ బీమా కంపెనీలతో ప్రజల సమాచార గోప్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

## బలహీనుల రక్షణ కవచం రాజ్యాంగం



మాట్లాడుతున్న టి.ఈశ్వర్, న్యాయవాదులు

రాయచోటి అర్బన్: దేశంలోని బడుగు, బలహీనుల హక్కులకు రాజ్యాంగం రక్షణ కవచంగా ఉందని భారత న్యాయవాదుల సంఘం(ఐఏయల్) ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ అన్నారు. స్థానిక ప్రతిభా జూనియర్ కళాశాలలో ఐఏఎల్ ఆధ్వర్యంలో రాజ్యాంగం– చట్టాలపై చైతన్య సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాలను తెలుసుకోవాలన్నారు. చెట్లను నరికివేస్తే పడే శిక్షల గురించి న్యాయవాది డి.నాగ ముని వివరించారు. దళితులపై దాడులు చేసేవారికి ఎలాంటి శిక్షలు పడతాయనే అంశంపై న్యాయవాది ఎం.రవిశంకర్ అవగాహన కల్పించారు. ప్రతిభా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత అసలైన మార్గదర్శకులు గురువులే అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్, వరలక్ష్మి, శివకుమార్, హరీష్, కిరణ్, జగదీష్ కుమార్, ఇర్షాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు బిల్లుల చెల్లింపు సులభతరం



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈఈ చంద్రశేఖరరెడ్డి

రాజంపేట రూరల్: విద్యుత్తు బిల్లులను క్యూఆర్ కోడ్ ద్వారా సులభతరంగా చెల్లించవచ్చని విద్యుత్తు శాఖ ఎస్ఈ ఆర్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఈఈ చంద్రశేఖరరెడ్డి బుధవారం క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులను మీ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ట్రాన్సాక్షన్ చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో చెల్లింపులు ఎంతో సౌకర్యంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎస్.రాజశేఖరరెడ్డి, డీఈఈలు సురేంద్రనాథ్, మురళీధర్‌రెడ్డి, బాస్కర్, ఏఈలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోలు పనిచేయకపోతే వేతనాలు నిలిపివేయండి

**కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్**

సిద్దవటం: వీఆర్‌వోలు పనులు చేయకపోతే వారి వేతనాలు నిలిపి వేయాలని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఇన్‌ఛార్జి తహసీల్దారు మాధవీ లతకు సూచించారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో రికార్డు రూమ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం వీఆర్‌వోలు, సర్వేయర్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలో వచ్చిన అర్జీలపై ఆరాతీసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్‌ఓ వీక్‌గా ఉన్నచోట్ల సమర్థులైన వారితో పూర్తిచేయించాలని వివరించారు. భూ సర్వేలో వచ్చిన 99 అర్జీలను వేగంగా పూర్తిచేయాలని తెలిపారు. పనులు చేయకపోతే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు.శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామం నుంచి ఫిర్యాదులు చాలా వచ్చాయని, సమగ్ర విచారణ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం ఏఓ శంకర్‌రావు, ప్రసాద్‌బాబు, నాగభూషణంరెడ్డి, వీఆర్‌వోలు, సిబ్బంది, పాల్గొన్నారు.

### ఉపాధి పనులు నిరుపయోగం చేయవద్దు

వీరబల్లి: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను నిరుపయోగం చేయవద్దని మండల రైతు సంఘం నాయకుడు గిరికుమార్‌రెడ్డి తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ పథకం ద్వారా రైతులను ఆదుకునే పనులు కల్పించాలన్నారు. రైతులకు పైర్లు పెట్టుకొనేందుకు, తోటల్లో పనులు చేసుకొనేందుకు ఉపయోగపడితే ఆర్థికంగా ఇబ్బందులు తొలగుతాయన్నారు.

## పీఆర్ రాష్ట్ర ప్రధాన ఇంజినీర్‌కు సన్మానం



రమణమూర్తిని సన్మానిస్తున్న ఎంపీపీ

నందలూరు: పంచాయతీరాజ్ రాష్ట్ర ప్రధాన ఇంజినీర్ రమణ మూర్తిని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ అధ్యక్షుడు మేడా విజయభాస్కర్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి రాధాకృష్ణంరాజు, సిబ్బంది పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో మండల అభివృద్ధి, పంచాయతీరాజ్ పనితీరుపై రమణ మూర్తి మండల పరిషత్ అధ్యక్షులతో చర్చించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, కాంట్రాక్టర్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగులకు మధ్యంతర భృతి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి రామకృష్ణ

పెనగలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ నాయకుడు పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిటీని నియమించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ అమలు చేయుటకు వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి తిరిగి అమలు చేయాలని కోరారు. జీరో సర్వీసులు పరిగణలోకి తీసుకొని బదిలీలు చేపట్టాలన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనల సమస్యలను పరిష్కరించి అర్హత కలిగిన ఎస్ఏలకు జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, అల్లం అశోక్ కుమార్, పుచ్చకాయల ఎల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చిట్వేలి: తిప్పాయపాలెం పంచాయతీ గట్టుమీదపల్లిలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు బుధవారం రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాష్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఇళ్ల స్థలాలు, రోడ్లు, విద్యుత్, నీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, అధికారులు, యువకులు పాల్గొన్నారు.

## చట్టాల మార్పునకు యత్నం





రాజంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



రాయచోటిలో

రాయచోటి అర్బన్: కార్పొరేట్‌ల ప్రయోజనాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎ.రామాంజులు, సాంబశివ పేర్కొన్నారు. అఖిలపక్ష కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు రాయచోటిలో మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండు సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేశారన్నారు. భాగ్యలక్ష్మి, పీఎల్.నరసింహులు, మహేష్, వంగిమళ్ల రంగారెడ్డి పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ త్రివేణి కార్మిక సంఘం నాయకులు కోరారు. స్థానిక ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గంగాధర్, మురళీ, టి.కృష్ణ చైతన్య, వెంకటరమణ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్, కార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

చిన్నమండెం: కేంద్రంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏవీ. రమణ రెడ్డమ్మ, మేరీసులోచన, శ్రీలత, సిద్దమ్మ, మునీరా, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

రాజంపేట: కార్మిక చట్టాలను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు రమణ, ఈశ్వరమ్మ పేర్కొన్నారు. రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ సర్కారు కార్మికుల జీవితాలను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. సురేష్, ప్రసాద్, లక్ష్మీదేవి, సారమ్మ, బాలాజీ పాల్గొన్నారు.

సుండుపల్లె: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం సుండుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ధర్నా చేపట్టారు. ఎ.రామాంజులు, ఓబులేసు, నాగేంద్ర, ఆనంద్, కృష్ణయ్య, రామసుబ్బయ్య, ఎల్లమ్మ, ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గుంటిమడుగుకు కొరముట్ల సంతాపం



కన్నీటి పర్యంతం అయిన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



కసిరెడ్డి శ్రీవాణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీటీసీ గుంటిమడుగు సుధాకర్‌రాజు(65) మృత దేహానికి తన స్వగ్రామం సిద్దిరాజు కండ్రికలో బుధవారం అంత్యక్రియలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు సుధాకర్‌రాజు మృత దేహాన్ని సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు. స్నేహితుడి పాడె మోసి దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు. కొరముట్ల మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ప్రతి నిత్యం తోడుగా, స్నేహితుడిగా దగ్గరుండి చూసుకొనేవాడని గుర్తు చేసుకొన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ఇంటికి కూడా పోకుండా తన వెంట ఉంటూ ఒక అన్నగా ధైర్యం చెప్పేవాడన్నారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించే వారని తెలిపారు.

**నివాళులర్పించిన ప్రముఖులు**

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుంటిమడుగు సుధాకర్‌రాజు అంత్యక్రియలలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పుల్లంపేట మండల అధ్యక్షుడు ముద్దాబాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వత్తలూరు సాయికిశోర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ముప్పాల హేమనవర్మ, సీడీ.నాగేంద్ర, గుత్తిరెడ్డి హరినాథరెడ్డి, శివారెడ్డి, ఆర్వీరమణ, కొరెడ్డి సిద్దయ్య, పండుగోలుమణి తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని రాఘవరాజపురం హరిజన వాడకు చెందిన వైఎస్సార్ అభిమాని చౌడవరం శివయ్య అకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, హేమనవర్మ, ఆర్వీ. రమణ, శివారెడ్డి పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన కసిరెడ్డి శ్రీవాణి, కసిరెడ్డి సుబ్బారెడ్డిల దశదిన కర్మ కార్యక్రమంలో రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మృతుల చిత్రపటం వద్ద నివాళులర్పించి వారి కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**రిటైర్డ్ వీఆర్వో మృతి**

మండలంలోని తొగురుపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ వెంకటనరసయ్య అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆయన పార్థివ దేహం వద్ద నివాళులర్పించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### మూడు ఆవులు మృతి

చిన్నమండెం: మండలంలోని తూర్పుపల్లికు చెందిన షేక్ మహమ్మద్‌రఫీకి చెందిన రూ.1.5 లక్షల విలువగల మూడు ఆవులు బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందాయి. పశువైద్యాధికారి గణేష్ పరిశీలించి ఫుడ్ పాయిజన్ జరిగినట్లు అనుమానంగా ఉందన్నారు.

### పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన

పెనగలూరు: మండలంలోని కోడి చెన్నాగారిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో పూర్వ ప్రాథమిక విద్యపై సీడీపీఓ నిర్మలజ్యోతి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు, ఆరు సంవత్సరాల మధ్య ఉన్న బాల, బాలికలకు పూర్వ ప్రాథమిక విద్య, అంగన్ వాడీ సెంటర్‌లో చెప్పడం జరుగుతుందని తెలిపారు. విజయకుమారి, విజయ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

### శాంతియుత ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

లక్కిరెడ్డిపల్లి: రాజ్యాంగ లౌకిక విలువలు కాపాడాలంటూ బీజేపీ జిల్లా కార్యదర్శి ఆనంద్ గజపతిరాజు, హిందూ చైతన్య వేదిక సృజన కుమార్ అన్నారు. ఎస్‌బీఐ కుర్నూతల బ్యాంకు సమీపంలో హిందువుల నివాస గృహాల మధ్య ఓ వర్గం వారు ప్రార్థనామందిరం నిర్మించి విస్తరణ పనులు చేపట్టారన్నారు. తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొంతమంది బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ స్థానిక మహిళలు, యువకులు బుధవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్, పోలీస్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కొండూరు వెంకటరామరాజు, సురేష్, నరసింహులు, సుభాషిణి, పాల్గొన్నారు.